క్లుప్తంగా

డ్రైనేజీల్లో ప్లాస్టిక్ కవర్లు వేయొద్దు



సూచనలు చేస్తున్న కమిషనర్ వేణుమాధవ్

సుల్తానాబాద్: ఇంటి యజమానులు డ్రైనేజీల్లో ప్లాస్టిక్ కవర్లు, చెత్త చెదారం వేయొద్దని మున్సిపల్ కమిషనర్ వేణుమాధవ్ సూచించారు. బుధవారం పట్టణంలోని పలు కాలనీల్లో మున్సిపల్ కార్మికులు డ్రైనేజీలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా పలు కాలనీలను ఆయన సందర్శించారు. 15 కాలనీల్లో ఉన్న డ్రైనేజీ కాలువలను నిరంతరం శుభ్రం చేయాలని సూచించారు. ఆయన వెంట ప్రత్యేక అధికారి సహా పలువురు ఉన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



పనులపై చర్చిస్తున్న అధికారులు

రామగిరి: మండలంలోని రత్నాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని పలు అభివృద్ధి పనులను బుధవారం ఆర్అండ్బీ, విద్యుత్ అధికారులు కలిసి పరిశీలించారు. బేగంపేట క్రాస్‌రోడ్ వద్ద డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేదని, రోడ్డు విస్తరణతో విద్యుత్ స్తంభాలతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ప్రజల ఇబ్బందులను గుర్తించి వెంటనే నిధులు మంజూరు చేయాలని గతంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోట్ల తిరుపతియాదవ్ మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లి నిధుల మంజూరుకు కృషి చేశారు. స్పందించిన మంత్రి నిధులు మంజూరు చేయడంతో పనులు సాగుతున్నాయి. ఆర్అండ్బీ, విద్యుత్ అధికారులు కలిసి వచ్చి తొలిగించే విద్యుత్ స్తంభాలపై చర్చించారు. కార్యక్రమంలో ఆర్అండ్బీ, విద్యుత్ అధికారులు పాల్గొన్నారు.

గోశాల నిర్మాణానికి రూ.50వేల విరాళం



నగదు అందజేస్తున్న సత్యనారాయణ

సుల్తానాబాద్: పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు అల్లం సత్యనారాయణ–భాగ్యలక్ష్మి దంపతులు రూ.50వేల నగదును గోశాల నిర్మాణానికి అందజేశారు. బుధవారం వారి నివాసంలో గోశాల నిర్వాహకులు సూర్యకు అందజేశారు. తమవంతు సహకారం గోశాలకు ఎప్పుడూ ఉంటుందన్నారు.

లేబర్‌కార్డుల పంపిణీ



లేబర్ కార్డులు పంపిణీ చేస్తున్న రతన్

రామగుండం: కుందనపల్లి గ్రామ పంచాయతీ అక్బర్‌నగర్‌లోని కమ్యూనిటీ హాలులో బుధవారం అక్బర్‌నగర్ ఇంటిలిజెంట్స్ కమిటీ కొండల రాజేందర్‌కుమార్ ఆధ్వర్యంలో లేబర్ కార్డులను పంపిణీ చేశారు. మీసేవ రతన్, చాంద్ పాషా, ఫరూక్‌లే పాల్గొన్నారు.

ఓటుహక్కుపై అవగాహన

ముత్తారం: మండలంలోని కేశనపల్లిలో బుధవారం తెలంగాణ సాంస్కృతిక సారథి కళాబృందం ఓటు వినియోగం, ప్రాముఖ్యతపై కళాకారులు తమ ప్రదర్శనలతో స్థానికులకు అవగాహన కల్పించారు. అలాగే పరిసరాల పరిశుభ్రతపై కళాకారులు తమ ఆటపాటలతో వివరించారు. కళాకారులు జనగామ రాజనర్సు, ఇదునూరి పద్మ, బుర్ర శంకర్‌గౌడ్, కొండ్ర వెంకన్నగౌడ్, సలేంద్ర రాజన్న, చిన్న రమ, దీకొండ శ్రావణ్, కన్నూరి రేణుక పాల్గొన్నారు.

నవగ్రహ ప్రతిష్ఠాపనకు భూమిపూజ

రామగిరి: మండలంలోని కల్వచర్ల సంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో బుధవారం నవగ్రహ ప్రతిష్ఠాపనకు భూమిపూజ నిర్వహించారు. నవగ్రహ విగ్రహాలు, మండప నిర్మాణ దాత బూసాల కమల సత్యనారాయణ దంపతుల ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు వేణుగోపాలాచార్యులు, సాగరాచార్యులు భూమిపూజ నిర్వహించారు. మాజీ జెడ్పీటీసీ గంట వెంకటరమణారెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ కొలిపాక సత్తయ్య, ఎంపీటీసీ కొట్టి సందీప్, మాజీ సర్పంచ్‌లు గంట పద్మ, రేండ్ల అశోక్, దేవ రామస్వామి, బూసాల సత్యసాయిరాం, బూసాల చిన్నారావు, వొడితెల శ్రీనివాస్, మేకల మారుతి, బూస మల్లయ్య, బాపన్న పాల్గొన్నారు.

కార్మికులకు తాగునీటి సమస్య రావొద్దు

- సింగరేణి సీఎండీ బలరామ్

గోదావరిఖని: వేసవిలో కార్మిక కుటుంబాలకు నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సింగరేణి సీఎండీ బలరామ్ ఆదేశించారు. బుధవారం స్థానిక గంగానగర్‌లోని సింగరేణి ఫిల్టర్‌బెడ్‌ను పరిశీలించి నీటిసరఫరా గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఉద్యోగుల క్వార్టర్లకు సురక్షిత తాగునీరు క్రమం తప్పకుండా అందించాలన్నారు. తాగునీటి శాశ్వత పరిష్కారం కోసం రూ.18 కోట్లతో 35 ఎంఎల్‌డీ రాపిడ్ గ్రావిటీ ఫిల్టర్‌ప్లాంట్‌లు నిర్మిస్తామని తెలిపారు. ఆర్జీ–1, 2, 3 జీఎంలు శ్రీనివాస్, సూర్యనారాయణ, సుధాకర్ ఉన్నారు.

మందుటెండను లెక్కచేయకుండా..



క్వారీలో పనులు పరిశీలిస్తున్న సీఎండీ బలరామ్

సింగరేణి సీఎండీ బలరామ్ ఆర్జీ–2 ఏరియా ఓసీపీ–3లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తొలుత క్వారీలోకి వెళ్లి మండుటెండలో కోల్‌బెంచ్‌లో పనులు పరిశీలించారు. ప్రైవేట్ ఓబీ పనులు వేగవంతం చేయాలన్నారు. క్యాంటీన్‌లో కార్మికులతో కలిసి అల్పాహారం చేసి ఉత్సాహపరిచారు. షావల్స్, డ్రిల్‌సెక్షన్, బేస్‌వర్క్‌షాప్‌లో తనిఖీ చేసి కార్మికులతో కలిసి మాట్లాడి వారితో ఫొటోలు దిగారు.

జీజీహెచ్‌లో పిల్లలకు నాణ్యమైన సేవలు

కోల్‌సిటీ: గోదావరిఖనిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)లో కార్పొరేట్ తరహాలో పీడియాట్రిషన్ సేవలు అందిస్తున్నట్లు ఆర్ఎంవో అరుణ, పిల్లల వైద్యనిపుణులు ఎ.శిరీష, పి.శిరీష, కె.రాజీవ్ తెలిపారు. బుధవారం ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అప్పుడే పుట్టిన శిశువులకు రోజూ అన్నిరకాల టీకాలు ఉచితంగా వేస్తున్నట్లు తెలిపారు. పిల్లల వైద్యనిపుణులు 24 గంటలపాటు అందుబాటులో వైద్యసేవలు అందిస్తున్నారని అన్నారు. ఇప్పటివరకు అతితక్కువ బరువుతో పుట్టిన 8మంది నవజాత శిశువులకు మెరుగైన వైద్య సేవలు అందించి బరువు పెంచడంతోపాటు కంటి, వినికిడి, గుండె పనితీరుపై వైద్య పరీక్షలన్నీ పూర్తి చేశామని వెల్లడించారు. వారి ఆరోగ్యంపై కూడా



మాట్లాడుతున్న డాక్టర్లు

పర్యవేక్షణ కొనసాగిస్తున్నామని తెలిపారు. ఆస్పత్రిలో మొత్తం 11 మంది పీడియాట్రిషన్లు ప్రత్యేక సేవలు అందిస్తున్నారని అన్నారు. ఇందులో ఒక హెచ్‌వోడీ, మరొక అసోసియేట్ ప్రొఫెసర్, నలుగురు అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ఇద్దరు మెడికల్ ఆఫీసర్లు, ముగ్గురు సీనియర్ రెసిడెన్సీ డాక్టర్లు ఉన్నారని వివరించారు. సుమారు రూ.5లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ఖర్చు అయ్యే అత్యాధునిక ట్రీట్‌మెంట్‌ను ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. 30 పడకల పీడియాట్రిషన్ ఇన్సెంటివ్ కేర్ యూనిట్(పీఐసీయూ) ప్రత్యేక వార్డుతోపాటు 20 పడకల ఎస్ఎన్‌సీయూ వార్డు ద్వారా మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. నీలోఫర్ ఆస్పత్రిలోని సీనియర్ డాక్టర్ల పర్యవేక్షణలో సీప్యాడ్, వెంటిలేటర్ ద్వారా సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ ట్రీట్‌మెంట్ అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కొందరు పిల్లలకు 45 రోజుల వరకు కూడా ఇన్‌పేషెంట్‌గా అడ్మిట్ చేసుకొని వైద్యం అందిస్తున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో పిల్లలకు లభిస్తున్న ఉచిత వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

అనాథ యువతికి ప్రభుత్వ విప్ ఆర్థికసాయం

ధర్మారం: మండలంలోని నందిమేడారం గ్రామానికి చెందిన అనాథ యువతి బొడ్డు అక్షిత వివాహానికి ప్రభుత్వ విప్ ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ బుధవారం రూ.40వేల రూపాయల నగదు, బట్టలు అందించారు. బొడ్డు అక్షిత తల్లిదండ్రులు బొడ్డు రాజేశం–శశికళ అనారోగ్యంతో మరణించారు. దీంతో అక్షిత బంధువుల సహకారంతో ఒంటరిగానే ఉంటూ ధర్మారంలోని లేడీస్ ఎంపోరియంలో పనిచేస్తోంది. ఇటీవల లక్షెట్టిపేట మండలం ఇటిక్యాలకు చెందిన గడమల్ల రాజుతో 26న వివాహం నిశ్చయమైంది. విషయం తెలుసుకున్న విప్ సాయం అందించారు. అనంతరం ఇటీవల ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదంలో ఇదే గ్రామానికి చెందిన సత్తయ్య ఇల్లు దగ్ధం కాగా సంఘటన స్థలాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీ మండల అధ్యక్షుడు



నగదు అందజేస్తున్న ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్

గాగిరెడ్డి తిరుపతిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు లావుడ్య రూప్లానాయక్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొత్త నర్సింహం, నాయకులు దేవి జనార్దన్, అరిగె లింగయ్య, కోమటిరెడ్డి దేవేందర్‌రెడ్డి, పాలకుర్తి రాజేశంగౌడ్, మందపెల్లి మల్లేశం, సోగాల తిరుపతి పాల్గొన్నారు.

షాపింగ్ కాంప్లెక్స్ పరిశీలన



సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి శ్రీధర్‌బాబు

రామగిరి: మంథని–పెద్దపల్లి ప్రధాన రహదారిలోని సెంటనరీకాలనీ షాపింగ్ కాంప్లెక్స్‌ను బుధవారం మంత్రి శ్రీధర్‌బాబు పరిశీలించారు. కల్వచర్ల నుంచి ఆదివారంపేట గ్రామం వరకు రోడ్ విస్తరణ పనులు జరుగుతుండటంతో వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. షాపింగ్ కాంప్లెక్స్ సమస్యలు పరిష్కరించాలని మంత్రికి విన్నవించగా ఆయన పరిశీలించారు. రోడ్ విస్తరణతో దుకాణాలు అన్ని మరమ్మతులకు అనుమతి ఇవ్వాలని, విద్యుత్ లైన్లకు సంబంధించి అనుమతి ఇవ్వాలని ఆర్జీ–3 జీఎం ఎస్.సుధాకర్‌రావును ఆదేశించారు. అనంతరం వ్యాపారులు మంత్రిని సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆరెల్లి దేవక్క, జిల్లా ఉపాధ్యక్షుడు తోట చంద్రయ్య, పట్టణ అధ్యక్షుడు కాటం సత్యం, మండల ప్రచార కమిటీ చైర్మన్ ముస్త్యాల శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు బర్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదివితేనే ఉన్నత భవిష్యత్

పెద్దపల్లిరూరల్: విద్యార్థులు క్రమశిక్షణతో చదివితేనే మంచి భవిష్యత్ ఉంటుందని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. పెద్దపల్లిలోని పల్లవి మోడల్ స్కూల్ వార్షిక వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భావిభారత పౌరులను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు పల్లవి పాఠశాల యజమాన్యం పాటుపడుతోందని కరస్పాండెంట్ శోభారాణిని ఎమ్మెల్యే అభినందించారు. చదువుతో పాటు క్రీడారంగంలోనూ రాణించేలా విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. మున్సిపల్ మాజీ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు

చైర్మన్ ఎల్.రాజయ్య, ప్రముఖ వ్యాపారవేత్త ఓంప్రకాశ్ జాకోటియా, బండ మల్లన్న ఉన్నారు.

కోరం లేక మండల సభ వాయిదా

ఓదెల: మండల సర్వసభ్య సమావేశానికి సభ్యులు గైర్హాజరు కావటంతో మండల సభ వాయిదా పడింది. బుధవారం ఎంపీపీ కునారపు రేణుకదేవి అధ్యక్షతన ప్రారంభమైన మండల సభకు కేవలం జీలకుంట ఎంపీటీసీ రాగిడి రవీందర్‌రెడ్డి మాత్రమే హాజరయ్యారు. కోరం లేక వాయిదా వేసినట్లు ఎంపీపీ ప్రకటించారు. పొత్కపల్లి సింగిల్‌విండో చైర్మన్ ఆళ్ల సుమన్‌రెడ్డి, ఎంపీడీవో తిరుపతి, డాక్టర్లు మౌనిక, షాబొద్దీన్, ఏఈఈలు నాయక్, రాజమల్లు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మ, సూపరింటెండెంట్ శ్రీధర్, సీనియర్ అసిస్టెంట్ వెంకన్న ఉన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలి

రామగిరి: వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత ఆదేశించారు. మండలంలోని బుధవారంపేట గ్రామంలో ఆమె బుధవారం పర్యటించారు. తాగునీటి సమస్య ఉంటే మోటార్లను, హ్యాండ్ పంపులను మరమ్మతు చేయాలని సూచించారు. పైపులైన్ల లీకేజీలను సరిచేయాలని, గ్రామాల్లో నల్లా కనెక్షన్లు, మిషన్ భగీరథ పైపులైన్లను పరిశీలించి తాగునీటి సమస్య రాకుండా ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మంథని డీఎల్‌పీవో శంకర్, ఎంపీవోలు



వివరాలు తెలుసుకుంటున్న డీపీవో ఆశాలత

సమ్మిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ట్రినిటిలో కెరీర్ గైడెన్స్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న న్యాయవాది శ్రీనివాసరావు

పెద్దపల్లిరూరల్: చదువు కోసం, ఉద్యోగం కోసం విదేశాలకు వెళ్లే విద్యార్థులు అక్కడి పరిస్థితులపై పూర్తి అవగాహనకు వచ్చాకే ముందడుగు వేయాలని అంతర్జాతీయ న్యాయవాది కావేటి శ్రీనివాసరావు అన్నారు. ట్రినిటి ఇంజనీరింగ్ కాలేజీలో బుధవారం జరిగిన కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కార్యక్రమంలో పాల్గొని పలు సూచనలిచ్చారు. కాలేజీ అకడమిక్ డైరెక్టర్ అశోక్‌కుమార్, ప్రిన్సిపాల్ మణిగనేశన్, వివేక్, రాధిక, అవినాష్, ఆదిత్య ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

క్రిస్టియన్ మైనార్టీ అధ్యక్షుడిగా అభిషేక్‌రాజ్

గోదావరిఖని: రామగుండం కార్పొరేషన్ క్రిస్టియన్ మైనార్టీ అధ్యక్షుడిగా పాస్టర్ కె.అభిషేక్‌రాజ్‌ను నియమించారు. నియామక పత్రాన్ని రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ బుధవారం అందజేశారు. నాయకులు రాజేశ్, రాహుల్ ఉన్నారు.

ఆపరేటర్ల అవుట్‌సోర్సింగ్‌కు వ్యతిరేకంగా పోరాటం

గోదావరిఖని: మణుగూరు ఏరియాలో అవుట్‌సోర్సింగ్ ఆపరేటర్లకు వ్యతిరేకంగా కలిసివచ్చే సంఘాలతో యాజమాన్యంపై పోరాటం చేయాలని నిర్ణయించినట్లు హెచ్ఎంఎస్ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ తెలిపారు. బుధవారం స్థానిక యూనియన్ కార్యాలయంలో జరిగిన కేంద్ర కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. జూన్ 12న నిర్మల్ జిల్లా కడెంలో యూనియన్ ప్లీనరీ సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. నాయకులు జక్కుల నారాయణ పాల్గొన్నారు. హెచ్ఎంఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సీఎంటీఏఐ మాజీ అధ్యక్షుడు జి.కృష్ణప్రసాద్‌ను ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు.

కల్వచర్లలో ముగిసిన సప్తాహం

రామగిరి: మండలంలోని కల్వచర్ల ఉమామహేశ్వర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న సప్తాహం వేడుకలు బుధవారం ముగిశాయి. ఏడురోజులుగా అంగరంగ వైభవంగా కొనసాగిన కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

టీసీఎఫ్ జిల్లా జాయింట్ సెక్రటరీగా స్వరూప

జ్యోతినగర్: తెలంగాణ కన్జ్యూమర్ ఫోరం (టీసీఎఫ్) జిల్లా జాయింట్ సెక్రటరీగా గాండ్ల స్వరూపను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు అంబ రాథోడ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. రామగుండం కార్పొరేషన్ ఐదో డివిజన్ నర్రాశాలపల్లెకు చెందిన స్వరూపకు జిల్లా అధ్యక్షుడు రంగు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి బొల్లం మధుబాబు నియామక పత్రం అందించారు.

ఇసుక నిల్వలను పట్టుకున్న టాస్క్‌ఫోర్స్

ముత్తారం: మండలంలోని ఖమ్మంపల్లిలో నిల్వ చేసిన ఇసుక డంప్‌ను బుధవారం రామగుండం కమిషనరేట్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. మానేరు నుంచి ఇసుకను ఖమ్మంపల్లిలో ఓ ప్రాంతంలో నిల్వ చేసి దూర ప్రాంతాలకు తరలిస్తున్నారన్న సమాచారం మేరకు చేసిన తనిఖీలో ఇసుక డంప్ బయట పడిందని టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు. సుమారు 60ట్రాక్టర్ల ఇసుక డంప్‌ను గుర్తించారు. పట్టుకున్న ఇసుక డంప్‌ను ముత్తారం పోలీస్, రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చి వారికి అప్పగించారు.

వేదవ్యాస స్కూల్ స్నాతకోత్సవం

కాల్వశ్రీరాంపూర్: మండల కేంద్రంలోని వేదవ్యాస హైస్కూల్లో బుధవారం నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ చిన్నారులకు స్నాతకోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు సర్టిఫికెట్లు అందుకున్నారు. కరస్పాండెంట్ ఉమామహేశ్వర్, ప్రిన్సిపాల్ సదయ్య, పేరెంట్స్ కమిటీ సభ్యులు సురేందర్, సబిత, సౌజన్య, శ్రీనివాస్ ఉన్నారు.

గోవుల సంరక్షణ అందరి బాధ్యత

సుల్తానాబాద్: గోవులను సంరక్షించాల్సిన బాధ్యత హిందువులందరిపై ఉందని లయన్స్ క్లబ్ జోనల్ చైర్మన్ ప్రవీణ్ అన్నారు. బుధవారం పట్టణంలోని మార్కండేయకాలనీలో శ్రీధర్మశాస్త్ర ఆధ్వర్యంలో నడుపుతున్న గోశాలకు షెడ్డు కోసం భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు.

మహిళా మోర్చా అధ్యక్షురాలిగా మౌనిక

రామగిరి: బీజేపీ మహిళా మోర్చా మండల అధ్యక్షురాలిగా చందనాపూర్ గ్రామానికి చెందిన పొన్నం మౌనిక గౌడ్‌ను నియమించారు. బుధవారం జిల్లా అధ్యక్షుడు చందుపట్ల సునీల్‌రెడ్డి చేతులమీదుగా నియామక పత్రం అందజేశారు.

ఓటర్లకు సౌకర్యాలు కల్పించాలి

కాల్వశ్రీరాంపూర్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కాల్వశ్రీరాంపూర్ జెడ్పీ హైస్కూల్ ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లను బుధవారం ఆర్డీవో గంగయ్య పరిశీలించారు.



పరిశీలిస్తున్న ఆర్డీవో గంగయ్య

పోలింగ్ బూతుల్లో గాలి వెలుతురు, తాగునీటి సౌకర్యం కల్పించాలని, ఓటర్లకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ జహెద్‌బాషను ఆదేశించారు. ప్రతి ఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకునేలా గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. డీఈ ధీరజ్, ఆర్ఐ ఉదయశ్రీ ఉన్నారు.

పట్టుదలతో చదివితే ఏదైనా సాధ్యమే

గోదావరిఖనిటౌన్: పట్టుదలతో కష్టపడి చదివితే సాధించలేనిది ఏదీ లేదని రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ అన్నారు. బుధవారం స్థానిక గీతాంజలి పాఠశాలలో నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డే, కల్చరల్ ఫెస్ట్ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పాఠశాల కరస్పాండెంట్ కంది రవీందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఇంజపురి పులేందర్, ట్రస్మా రామగుండం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

అధ్యక్షుడు అదర్‌సండే సమ్మారావు, జిల్లా జనరల్ సెక్రటరీ చందుపట్ల తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

ఉత్పత్తి పెంచేందుకు కొత్త యంత్రాలివ్వాలి

గోదావరిఖని: బొగ్గు ఉత్పత్తి పెంచేందుకు ఓసీపీ–3 ప్రాజెక్టులో నూతన యంత్రాలు మంజూరు చేయాలని సంస్థ సీఅండ్ఎండీ బలరాంను ఏఐటీయూసీ నాయకులు కోరారు. బుధవారం ఓసీపీ–3 సందర్శనకు వచ్చిన ఆయనకు వినతిపత్రం అందజేశారు. క్యాంటీన్, రెస్ట్‌హాల్‌లో ఏసీలు ఏర్పాటు చేయాలని, క్యాంటీన్‌లో భోజన సౌకర్యం కల్పించాలన్నారు. ఉత్పత్తి పెంచేందుకు కొత్త డోజర్స్, గ్రేడర్స్, డీజిల్ బోజర్స్ మంజూరు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న కార్మికులకు పదోన్నతి వెంటనే ఇప్పించాలని డిమాండ్ చేశారు. స్పందించిన సీఅండ్ఎండీ క్యాంటీన్‌లో భోజనాల ఏర్పాటు గురువారం నుంచి ప్రారంభించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారన్నారు. నాయకులు ఎల్.ప్రకాశ్, వైవీరావు, జూపాక రాంచందర్, జీగురు రవీందర్, ఎంఆర్ సీరెడ్డి పాల్గొన్నారు.



సీఅండ్ఎండీతో మాట్లాడుతున్న నాయకులు

ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే ఫిర్యాదు చేయండి

మంథని: ఎక్కడైనా ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే సీ విజిల్ యాప్ ద్వారా ఆన్‌లైన్, కాల్ సెంటర్ 1950కి ఫోన్ ద్వారా ఫిర్యాదు చేయొచ్చని మంథని ఆర్డీవో హనుమా నాయక్ తెలిపారు. బుధవారం మంథనిలోని తన కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి రాజకీయ పార్టీ ప్రతినిధులు, తహసీల్దార్లతో ఆయన సమావేశమయ్యారు. లోక్‌సభ ఎన్నికల నిర్వహణలో భాగంగా ప్రతీ తహసీల్దార్ తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేయాలని ఆదేశించారు.



మాట్లాడుతున్న ఆర్డీవో హనుమా నాయక్

కోల్ కారిడార్ రోడ్డు ఆధునీకరించాలి

గోదావరిఖని: నిత్యం విధుల కోసం వచ్చివెళ్లే కార్మికులు రోడ్డు ప్రమాదానికి గురవుతున్నారని, వెంటనే కోల్‌కారిడార్ రోడ్డు మరమ్మతు చేయాలని ఐఎన్‌టీయూసీ నాయకులు సీఅండ్ఎండీని కోరారు. బుధవారం ఓసీపీ–3 ప్రాజెక్టు సందర్శనకు వచ్చిన ఆయనకు వినతిపత్రం అందజేశారు. కోల్‌కారిడార్ రోడ్డు ప్రమాదకరంగా మారిందన్నారు. విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని, అలాగే రోడ్డు వెడల్పు చేసి ప్రమాదాలు జరగకుండా చూడాలని కోరారు. కార్మిక వాడలకు మంచినీరు రెగ్యులర్‌గా అందించాలన్నారు. రెస్ట్‌హాల్, క్యాంటీన్‌లో ఏసీ సౌకర్యం కల్పించాలన్నారు. క్యాంటీన్ ద్వారా కార్మికులకు భోజనాలు అందించాలని కోరగా వెంటనే స్పందించి అమలు చేయాలని



వినతిపత్రం ఇస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

అధికారులను ఆదేశించారు. గురువారం నుంచి అమలు చేసి ఫొటోలు పంపించాలని ఆదేశాలు జారీ చేశారు. నాయకులు కొత్త సత్యనారాయణరెడ్డి, ఎట్టం కృష్ణ, ఆకుల రాజయ్య, అక్రం తదితరులు ఉన్నారు.

బీజేపీ ఎంపీ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేయాలి

రామగిరి: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గెలుపునకు పార్టీ శ్రేణులు పనిచేయాలని జిల్లా అధ్యక్షుడు చందుపట్ల సునీల్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం సెంటనరీకాలనీ బీఎంఎస్ కార్యాలయంలో మండల అధ్యక్షుడు ముల్మూరి శ్రీనివాస్ అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించగా ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బూత్ స్థాయిలో ఇంటింటికీ వెళ్లి ప్రధాని నరేంద్ర మోదీ పదేళ్ల పాలనలో సాధించిన విజయాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. ప్రతి గ్రామంలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ప్రజా సంక్షేమం బీజేపీతోనే సాధ్యమన్నారు. బీజేపీ అభ్యర్థి గెలుపునకు ప్రతి కార్యకర్త సైనికుడిలా



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు సునీల్‌రెడ్డి

పనిచేయాలని కోరారు. మండల ఇన్‌చార్జి చెల్పూరి సతీశ్, మండల మహిళా అధ్యక్షురాలు పొన్నం మౌనిక, నాయకులు తీగల శ్రీధర్, మెరుగు శ్రీకాంత్, రేణికుంట్ల విజయ్, కొప్పుల క్రాంతి, నందిని, పొన్నం శివ పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ

గోదావరిఖనిటౌన్: బుధవారం విడుదలైన ఇంటర్ ఫలితాలలో స్థానిక శ్రీకాకతీయ, గాంధీ మెమోరియల్ జూనియర్ కళాశాలల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఎంపీసీ మొదటి సంవత్సరంలో జి.అమృత వర్షిణి 467 మార్కులు, బైపీసీలో హఫ్సాయామిన్ 436 మార్కులు, ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో నాగుల స్ఫూర్తి 992 మార్కులు, బైపీసీలో డి.అక్షయ శేఖర్ 982 మార్కులు సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ ఆకుల శ్రీనివాస్ అభినందించారు. అలాగే స్థానిక కృష్ణవేణి వికాస్ జూనియర్ కళాశాలకు చెందిన ఇంటర్ ఎంపీసీ మొదటి సంవత్సరం ఓ.యశ్వంత్ 465 మార్కులు, బైపీసీలో ఎం.దీక్షిత్‌గౌడ్ 408మార్కులు సాధించారు. ఇంటర్ రెండో సంవత్సరం ఎంపీసీలో ఇ.నవ్యశ్రీ 990 మార్కులు, బైపీసీలో బి.భావన తేజస్వి 959మార్కులు సాధించారు. విద్యార్థులను కాలేజ్ చైర్మన్ నాగండ్ల రవికుమార్ అభినందించారు.

మదర్ థెరిస్సాలో ఇంజనీరింగ్ వర్క్‌షాప్ ముగింపు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని మదర్‌థెరిస్సా ఇంజనీరింగ్ కాలేజీలో టాస్క్ ఆధ్వర్యంలో జరిగిన మూడురోజుల వర్క్‌షాప్ బుధవారం ముగిసింది. హెచ్‌టీఎంఎల్ 5, సీఎస్ఎస్3 అంశాలపై టాస్క్ ట్రైనర్ సిరిచందన అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ప్లేస్‌మెంట్ అధికారి వెంకటేశ్వర్లు, ఏవో పవన్‌కుమార్ ఉన్నారు.

స్వామివారికి రుద్రాభిషేకం

సుల్తానాబాద్: పట్టణంలోని శివాలయంలో స్వామివారికి పలురకాల పండ్లతో రుద్రాభిషేకం నిర్వహించారు. బుధవారం స్వామివారికి ప్రత్యేక పూజలను ఆలయ కమిటీ చైర్మన్ అల్లంకి సత్యనారాయణ–భాగ్యలక్ష్మి నిర్వహించారు.

లేఅవుట్ ఉంటేనే ఇంటి నిర్మాణాలకు అనుమతి

పెద్దపల్లిరూరల్: పంచాయతీల్లో లే అవుట్ నిబంధనలకు లోబడి ఉన్న ప్లాట్లలోనే ఇంటి నిర్మాణాలకు అనుమతి ఇస్తామని మండల పరిషత్ అధికారి సుదర్శన్ తెలిపారు. పెద్దపల్లి మండలం రాఘవాపూర్‌లో నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన వెంచర్లలో బుధవారం హద్దురాళ్లను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లేఅవుట్ అనుమతి పొందిన తర్వాతే ప్లాట్ల అమ్మకాలు జరపాలంటూ నిర్వాహకులకు నోటీసులు అందించినట్లు పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శి శ్రీధర్, సిబ్బంది తదితరులు ఉన్నారు.